# ఏక్సిడెంట్

పి. శైలజ

ఆఫీసునుండి ఇంటికి రాగానే సౌజన్య కోసం చూశాడు ఆనంద్. హాల్లో తల్లి, వదిన కనిపించారు. కానీ సౌజన్య కనబడలేదు. గదిలోకి వచ్చాడు. అక్కడా కనిపించలేదు. కింద ఏదో పని చేసుకుంటున్నట్లుంది. ఆమెను పిలవబోయి ఆగిపోయాడు. అతడికి మెరుపు లాంటి ఆలోచన వచ్చింది. ఇదే మంచి సమయం! సౌజన్య గత జీవితం రహస్యాన్ని తెలియజేసే ఫోటోలు, లేఖలు ఏమయినా దొరకవచ్చు. సౌజన్య ఉండగా ఆమె ఎదురుగా తను ఏమీ చేయలేడు. ఆమెను చూడగానే ఎంతో బలహీనుడయిపోతాడు అనుకుంటూ గబగబా బీరువా తెరిచి బట్టలన్నీ కెలకసాగాడు. చీరలన్నీ మడతలు తీసేశాడు ఎక్కడా ఫోటో కానీ, ప్రేమలేఖ కానీ కనిపించలేదు. సౌజన్య బుక్స్ రాక్ అంతా వెదికాడు. ఫోటో ఆల్బమ్ తిరిగేశాడు. ఎక్కడా ప్రేమించిన వాడి ఫోటో కనిపించలేదు. వెతికి, వెతికి నీరసంగా కుర్చీలో కూర్చున్నాడు.

తను సౌజన్యను ఎంత ఇష్టపడి చేసుకున్నాడు! అందులో పాతిక వంతయినా సౌజన్యకు తన మీద ఇష్టం ఉందా? లేదు. ఎందు కుంటుంది? తను సౌజన్య కంటె చదువులో, అందంలో తక్కువ. సౌజన్య ఎమ్. ఎ. పాసయింది. అందమైన సౌజన్య — సౌజన్య తండ్రి బీదవాడు. కట్నం ఇవ్వలేని పరిస్థితుల్లో ఉన్నాడు. తనకు ఏ సంబంధమూ నచ్చక సంబంధాల వేటలో విసిగి పోయినప్పుడు తొలకరి జల్లులా సౌజన్య కనిపించింది. గ్రాడ్యుయేషన్ డిస్‌కంటిన్యూ చేసి పెద్ద బిజినెస్ మాగ్నెట్‌గా స్థిరపడిన తను అందమైన సౌజన్యను కట్నం లేకుండా పెళ్ళి చేసుకున్నాడు. కానీ తనలో ఏదో అశాంతి —సౌజన్య తనను ఇష్టపడలేదేమో అనే అనుమానం. తన మాటకు ఏనాడూ ఎదురుచెప్పదు సౌజన్య. తనకు నచ్చినట్లే ప్రవర్తిస్తుంది. అయినా సౌజన్య



ద్వారా తను పూర్తి సంతృప్తి పొందలేక పోతున్నాడు. ఎప్పుడూ నెమ్మదిగా, గాంభీర్యంతో ప్రవర్తించే సౌజన్య వ్యక్తిత్వం ముందు తను ఓడిపోతున్నాడు.

పెళ్ళికి ముందు తను ఎన్ని వూహించాడు. సౌజన్యతో తన జీవితం ఉత్సాహంగా ఉంటుందని వూహించాడు. పెళ్ళయినప్పటి నుండి చూస్తున్నాడు. ఎప్పుడూ ఎక్కువగా మాట్లాడదు. తనేం చెప్పినా ఖండించదు. ఓపికగా వింటుంది. సినిమాలకు రమ్మంటే వస్తుంది. చీరలు కొనిస్తే కట్టు కుంటుంది. కానీ తనంతట తాను 'సినిమాకు పోదాం', 'చీరలు తెండి' అని ఒక్క మాటా అడ గదు. తను ఆఫీసు నుండి ఆలస్యంగా వచ్చినా ఆదుర్దా పడదు. తను లేకుంటే 'మీరు లేకుంటే బోర్ కొడుతూందండి' అని ఆమె నోటి నుండి ఒక్కసారయినా వినాలని ఆశించాడు. కానీ, అవేమీ జరగలేదు. వయస్సుకు మించిన హుందాతనంతో మితంగా మాట్లాడుతుంది.

సౌజన్య ప్రవర్తన తన కర్థం కావడం లేదు. కాలేజీలో చదివేటప్పుడు ఎవరినైనా ప్రేమించిందా? లేక తనంటె ఇష్టం, లేదా?...అవును, తన దగ్గర డబ్బు తప్ప ఏమీ లేదు. తను సౌజన్య కంటె తక్కువ చదివాడు—అందగాడు కాదు. తన కంటె సౌజన్య ఎంతో అందంగా ఉంటుంది. కట్నం ఇవ్వలేని పరిస్థితుల్లో తను కట్నం తీసుకోను అనగానే తనను చేసుకుంది కాబోలు—తనంటే ఇష్టం లేదేమో! ఆలోచనలతో బుర్ర వేడెక్కి పోయింది.

అడుగుల చప్పుడయింది. సౌజన్య వస్తున్నట్టుంది.

"అరె... మీరివ్వాళ అప్పుడే వచ్చేశారా... ఏమిటే, గదిని ఇలా చేశారు? ఏం కావాలో చెబితే నేనే వెతికి ఇచ్చేదాన్నిగా." గది అంతా చిందర వందరగా ఉండటం చూసి అడిగింది.

"ఏం కావాలా? నీ పాత ప్రియుడి ఫోటో. లేకపోతే ప్రేమలేఖ కావాలి." కసిగా అనుకున్నాడు కానీ, ఆమెతో అనే ధైర్యం లేకపోయింది.

"అయ్యయ్యో... చిన్న పిల్లాడిలా చీరలన్నీ ఇలా చేశారేమిటి?" నవ్వింది. అదే నవ్వు—ఎంతటి వాళ్ళనయినా సమ్మోహనాస్త్రులను చెయ్యగల నవ్వు. ఆ నవ్వు చూసే తను చేసుకున్నాడు.

ఇంత అందమైన సౌజన్యకు ప్రేమికులు లేకుండా ఉంటారా?

"ఏమిటలా ఉన్నారు?" అతడివైపు చూస్తూ అడిగింది.

"తలనొప్పిగా ఉంది." కళ్ళ మీద నుండి చేతులు తియ్యకుండానే చెప్పాడు ఆనంద్.

"టాబ్లెట్ ఏదయినా వేసుకుంటారా?" ఆ గొంతులో ఆదుర్దా ఏమీ లేదు. మామూలుగా ఉంది. "కాఫీ తాగుతారా?" అన్నంత సహజంగా అడిగింది.

"ఇవ్వు" అన్నాడు.

వెళ్ళి టాబ్లెట్, నీళ్ళు తెచ్చి ఇచ్చి గదంతా సర్ద సాగింది. తలనొప్పి లేకపోయినా ఆమె మీద కోపం కొద్దీ మాత్ర మేసుకున్నాడు. అంతేలే! తనకు తల నొప్పి అన్నా ఆమె కేమీ పట్టదు. జ్వరం వచ్చినా ఆమె కేమీ పట్టదేమో! "తల నొప్పా? తల పట్టనా?" అంటూ ఆదుర్దాగా అడిగితే తన కెంత తృప్తిగా ఉంటుంది. తను ఎలాంటి విషయం చెప్పినా ఏమాత్రం ఆత్రత కన బరచదు. ఆమె చదువుతున్న పుస్తకాల వైపు చూశాడు. ఆ పుస్తకాల్లో ఒక్కటి కూడా తను చదవలేదు. ఎలా చదువుతాడు? అవి చదివి అర్థం చేసుకునే శక్తి కూడా తనకు లేదు. సౌజన్య అయితే ఎమ్. ఎ. చదివిందిగా! అందుకే గొప్పగా అందరికీ తెలిసేలా ఉత్తమ సాహిత్యాన్ని గదిలో పెట్టుకుని తన గొప్పతనాన్ని నిరూపించు కుంటుంది. నిజంగానే సౌజన్యకు తనంటే ఇష్టం లేదు అనుకున్నాడు.

● ● ●

పన్నెండు గంట లవుతూంది. అప్పుడే పూజ ముగించుకుని భోంచేయడానికి వెళ్ళబోతూంది సౌజన్య. అప్పటికి రెండు రోజుల నుండి పూజ అంటూ ఉపవాసముంటూంది. ఆ రోజే కొద్దిగా భోంచేయాలని వెళుతూంది. ఆనంద్, అన్న, వదిన, తల్లి అందరూ ఆ ఇంట్లోనే ఉంటారు—అంతా ఉమ్మడి కుటుంబం.

ఫోన్ మోగింది. డైనింగ్ హాల్లోకి వెళ్ళబోతున్న సౌజన్య ఫోన్ తీసి "హలో" అంది.

"మిసెస్ ఆనంద్‌గారు కావాలి." అడుగుతున్నారెవరో.

"నేనే మిసెస్ ఆనంద్‌ని" అంది.

"నేను ఇన్‌స్పెక్టర్ రఘునిమాట్లాడుతున్నాను. గాంధీనగర్ క్రాసింగ్ దగ్గర ఆనంద్ గారికి ఆక్సిడెంట్ జరిగింది. వెంటనే రండి" అంటున్నా డతడు.

ఒక్క నిముషం అలాగా నిలబడి పోయింది సౌజన్య. ఉదయం తనతో 'వెళ్ళి వస్తానని' నవ్వుతూ చెప్పి వెళ్ళిన మనిషికి ఆక్సిడెంటా?

"ప్రమాదకరమైన పరిస్థితా?" అడి గింది.

"భయపడకండి... ఎక్కువ దెబ్బలు తగ లేదు. మీరు వెంటనే రండి."

"అలాగే వెంటనే వస్తున్నాను" అంటూ ఫోన్ పెట్టేసింది.

ఆనంద్ తల్లి, వదిన ఆదుర్దాగా "ఏమయింది?" అనడిగారు.

ఆక్సిడెంట్ విషయం చెప్పగానే వాళ్ళిద్దరూ గొల్లుమంటూ "మేమూ వస్తాం వద" అన్నారు.

"వద్దు... ముందు నేను వెళతాను అక్కడ పరిస్థితి చూసి మీకు ఫోన్ చేస్తాను" అంటూ వాళ్ళను వారిస్తూ రిక్షాలో వెంటనే బయలు దేరింది.

గాంధీనగర్ క్రాస్ రోడ్డు వద్ద జనం గుంపుగా ఉన్నారు. ఆనంద్ వెళుతున్న కారుని ఆ క్రాస్‌లో బస్సు గుద్దేసింది. ఆనంద్ తలకు బాగా గాయం తగిలింది. స్పృహ తప్పి పడిపోయి ఉన్నాడు.

# విషపు కప్ప

అట్లాంటిక్ తీరం లోని కోస్టారికా ప్రాంతంలో సంవత్సరం వర్షపాతం 250 సెం. మీ. నుండి 500 సెం. మీ. వరకూ ఉండటం వల్ల అక్కడ ఉన్న పర్వతాలూ, తీరమైదానాలూ కీకారణ్యాలతో నిండి ఉంటాయి. ఈ అరణ్యాలలో అనేక జాతులకు చెందిన కప్పలు కనిపిస్తాయి. వాటిలో జంతు శాస్త్రవేత్తలకు అత్యంత ఆసక్తిని కలిగించేది 'డెండ్రోబేటిడ్' జాతికి చెందిన కప్ప. దీన్ని జంతు శాస్త్ర పరిభాషలో 'డెండ్రోబేటిస్ ప్యూమిలో' అంటారు. ఇది సుమారు 25 మి. మీ. పొడ వుండి, ఆకారంలో మామూలు కప్పను పోలి ఉంటుంది. ఈ జాతికి చెందిన కప్పలు భారతదేశపు అరణ్యాలలో కూడా ఉన్నాయి.

ఈ కప్పలు అందమైన రంగులలో ఉండి చూపరులను ఆకర్షిస్తాయి కాని ఈ కప్పలు చాలా ప్రమాదకరమైన విష జంతువులు. వీటి విషం ప్రపంచంలో ఉండే అన్ని రకాల విషాల కన్నా ప్రమాద కరమయింది. వీటి అందమైన రంగులు, వీటిని సంహ రించే జంతువులను భయపెట్టడానికి ఉపయోగ పడతాయి. ఒక వేళ ఆ జంతువు ఈ రంగులకు ఆకర్షించబడితే కప్ప 'బెట్రడోటాక్సిన్' అనే విషాన్ని దాని చర్మం ద్వారా విడుదల చేస్తుంది. ఈ విషం ప్రభావం జీవుల ప్రసరణ వ్యవస్థకు కేంద్రమైన గుండెపై ఉండటం వల్ల జీవి వెంటనే చనిపోతుంది. ఇంతవరకూ ఈ విషానికి విరుగుడు కనిపెట్టలేదు. ఈ విషం ఆకర్షించబడిన జంతువు దేహంలోకి పూర్వపు దెబ్బల ద్వారా గాని, మ్యూకస్ పొరల ద్వారా కాని ప్రవేశిస్తుంది.

పూర్వం మన దేశపు అడవులలో నివసించే గిరిజనులు ఈ కప్పల విషాన్ని సేకరించి వాటిని బాణాల చివరలకు పూసి వేటాడే వారు. ఈ కప్ప విషం సేకరించడం చాలా ప్రమాదకరమైన పద్ధతి. కప్పను జాగ్రత్తగా ఒక ఆధారానికి వేలాడగట్టి దానికి వేడి తగిలే విధంగా మంట వేసేవారు. ఆ వేడి నుంచి రక్షించు కోవడానికై కప్ప విషాన్ని చుక్కలు చుక్కలుగా విడుదల చేస్తుంది. ఈ విష ప్రభావం వలన వేటాడిన జంతువు వెంటనే మరణిస్తుంది. ఈ కప్పలను వీర బాణపు కప్పలు, బాణపు విషపు కప్పలు అనేవారు.

-కె. శ్రీరాములు

అంబులెన్స్ వచ్చింది. ఆనంద్‌ని అంబులెన్స్‌లోకి ఎక్కించారు. అతడి తలను సౌజన్య ఒడిలో పడుకోబెట్టి కదిలితే రక్తం ఇంకా ఎక్కువ నష్టమవుతుందని చెప్పి కదలకుండా జాగ్రత్తగా చూసుకోమన్నారు.

అతడి తలను జాగ్రత్తగా కదలకుండా పట్టుకుని కూర్చుంది సౌజన్య. కాళ్ళు నరాలు పీకుతున్నాయి. నడుము నొప్పిగా ఉంది. రెండు రోజుల నుండి ఉపవాసం—నీరసంగా తల తిరుగుతున్నట్టుగా . ఉంది. భోజనానికి వెళ్ళబోయే ముందు ఈ ఫోన్ కాల్! తరవాత భోజనం ఏం సహిస్తుంది. అంబులెన్స్ హాస్పిటల్‌కు చేరే దాకా అలాగే కూర్చుండి పోయింది సౌజన్య.

హాస్పిటల్‌లో ఆనంద్ తలను పరీక్షించి ఏం ప్రమాదం లేదంటూ కట్టు కట్టారు. ముందు జాగ్రత్త కోసం రెండు రోజులు అబ్జర్వేషన్‌లో ఆనంద్‌ని ఉంచాలంటూ హాస్పిటల్‌లో చేర్చుకున్నారు.

మెల్లిగా కళ్ళు తెరిచాడు ఆనంద్! తల్లి, వదిన. ఏడుస్తున్నారు, అన్నయ్య ఆదుర్దాగా చూస్తున్నాడు. ఆనంద్ సౌజన్య వైపు చూశాడు— అదే గంభీరత, నిశ్చలత. కళ్ళలో ఒక నీటిచుక్క లేదు. అతడి మనస్సు బాధతో నిండి పోయింది. తనకు దెబ్బ తగిలినందుకు తల్లి, పరాయిదయిన వదిన ఏడుస్తూ ఉంటే, కట్టుకున్న భార్య... సుఖంలో, కష్టంలో భాగం పంచుకునే వ్యక్తి కళ్ళలో ఒక నీటి చుక్క కూడా లేదు. భర్త మీద ప్రేమ లేదనడానికి ఇంతకంటె నిదర్శనం ఏం కావాలి?...

★

## మిగిలిన అహం

**మనలోని దుర్గుణాలు మనల్ని వదలినప్పుడు, మన ప్రతిభవల్లనే వాటిని జయించగలిగామని గొప్పలు చెప్పుకుంటాం.**

—రోచ్ ఫికాల్డ

★

అతడికా క్షణంలో సౌజన్య పీక నులమాలన్నంత కోపం వచ్చింది. రాక్షసి! కట్టుకున్న భర్తను ప్రేమించలేని ఆడది ఒక ఆడదా? ప్రేమించలేనిది తన నెందుకు పెళ్ళి చేసుకోవాలి ... తన జీవితాన్ని నాశనం చేస్తోంది. తల బాధగా అనిపిస్తే కళ్ళు మూసుకున్నాడు.

డాక్టరు వచ్చి ''ఇక భయం లేదు. మీరంతా వెళ్ళొచ్చు. మిసెస్ ఆనంద్, మీరు చూసుకోగలరా లేక మీ వారి కోసం స్పెషల్ నర్సును ఏర్పాటు చెయ్యమంటారా '' అడిగాడు. అవసరం లేదు, డాక్టర్. నేను చూసుకోగలను'' అంది సౌజన్య ఆనంద్ తల్లి. వదిన ఇంటికి వెళ్ళుతూ సౌజన్యకు ఎన్నో జాగ్రత్తలు చెప్పారు.

అక్కడే అతని మంచం పక్కగా స్టూల్ మీద కూర్చుని చిన్నగా నిట్టూర్చింది సౌజన్య. ఆనంద్ అసలే కంగారు మనిషి. ఏ కాస్త జరిగినా ఎంతో హడావిడి చేస్తాడు. జ్వరం వచ్చినా తలనొప్పి వచ్చినా చిన్న పిల్లాడి కంటే ఎక్కువ హంగామా చేస్తాడు. ఇలాంటప్పుడు ఇంకెంత హడావిడి చేస్తాడో! అందుకే అతడి ముందు ఏడ్చి అతడిని కంగారు పెట్టదలుచుకోలేదు. అతడి తల్లి, వదిన ఏడుస్తున్నందుకే అతడికి ఆదుర్దాగా ఉంటుంది. తను కూడా అందరిలా బెంబేలు పడిపోతే అతడికి ధైర్యం చెప్పే వాళ్ళెవరు? అతడి తలకు కట్టిన కట్టుమీద చిన్నగా చేత్తో రాసింది. చప్పున సౌజన్య కళ్ళలో నీళ్ళు తిరిగాయి. అతడు చూడకుండా కళ్ళు తుడుచుకుంది.

హాస్పిటల్‌లో ఉన్న రెండు రోజులూ ఆనంద్‌ని కంటికి రెప్పలా చూసుకో సాగింది. అతడికి ఎంతో ధైర్యం చెప్పేది. సౌజన్య ధైర్యానికి ఆనంద్‌కే ఆశ్చర్యం కలిగేది.

'మీ మిసెస్ చాలా నిబ్బరం కలవారు. ఏ మాత్రం కంగారు పడలేదు. ఆమె పరిస్థితిలో వేరే లేడీ అయితే ఎంత కంగారు పడేదో!'' అంటూ డాక్టరు సౌజన్యను ప్రశంసిస్తూ ఉంటే ఆనంద్ మనసు బాధతో మూలిగింది. కంగారెందుకుంటుంది. తనను ప్రేమిస్తే కదా! భర్తను కాబట్టి తన డ్యూటీ తను చేస్తోంది అనుకున్నాడు.

* * *

ఆనంద్ హాస్పిటల్ నుండి ఇంటికి వచ్చేశాడు ఇంకా కొన్ని రోజులు రెస్ట్ తీసుకోవాలంటే బెడ్ మీదే ఉన్నాడు.

ఆనంద్ కోసం ఆరంజి జూస్ తీస్తోంది సౌజన్య. ఆమెని అలాగే చూడసాగాడు ఆనంద్. సాయంత్రం ఎండ సౌజన్య మీద పడి అసలే పసిమి రంగు సౌజన్య ఒంటికి మరింత మెరుపు నిస్తోంది. సౌజన్య దృష్టంతా గ్లాసు మీదే ఉంది అతి శ్రద్ధగా జూస్ కలపడమే ఆమె ధ్యేయమన్నట్లుగా ఉంది. ఈ నాలుగైదు రోజుల్లోనే చిక్కిపోయినట్లుగా తెలుస్తోంది చెక్కిళ్ళు పలచబడ్డాయి. నిజంగా సౌజన్యకు తనమీద ప్రేముందా? ఈమెలో ఏమాత్రం చలనం లేదూ? ఎంత నిర్లిప్తంగా తన కేమీ పట్టనట్టుగ ఉంది. మొహంలో బాధ ఆత్రత, సంతోషం ఏ భావం వ్యక్తం కాదెందుకు? అతడికి కసిగా ఉంది. తన మీద ప్రేమ లేనప్పుడు ఈ సేవలన్నీ ఎందుకు?

''జూస్ తీసుకోండి.'' గ్లాసు ఇవ్వబోయింది.

''అక్కర్లేదు...'' తోసేస్తూ విసురుగా అన్నాడు.

''అదేమిటి! ఆశ్చర్యంగా ప్రశ్నించింది.

''సుజా... ఇలా రా నిన్నొక మాట అడగాలి' అన్నాడు.

మౌనంగా దగ్గరకు వచ్చి నిలబడింది.

''నువ్వు కాలేజీలో ఎవరినైనా ప్రేమించావా?'' సూటిగా అడిగాడు.

''లేదే!'' తెల్లబోయి చూడసాగింది.

''నేనంటే ఇష్టం లేదా?... ఇంకో ప్రశ్న.

అతడి దోరణికి విస్తుపోయి చూడసాగింది



"ఏమిటి మీరు మాట్లాడేది?" అంది.

"నిజమే నేను మాట్లాడేది— నీ మనసులోని భావాల్ని దాచాలని ప్రయత్నించినా నేను కనుక్కోగలను. నువ్వు పెద్దల మాట కాదనలేక నన్ను పెళ్ళి చేసుకున్నావు. నేనంటే నీకు ఇష్టం లేదు— ప్రేమ లేదు. నాకు దెబ్బ తగిలినప్పుడు అమ్మ వదిన ఎంత ఆదుర్దా పడ్డారు. అందులో వెయ్యో వంతయినా కట్టుకున్న భార్యవి నువ్వు ఆదుర్దా పడ్డావా?... లేదు— నీకు నేనంటే ఇష్టం లేదు. అందుకే నా దగ్గర ముభావంగా ప్రవర్తిస్తావు..." మనసులో సౌజన్యకు అపాదించుకున్న మాటలన్నీ అనేశాడు.

మొదట అతడి మాటలకు పాలిపోయిన ఆమె మొహం క్షణం తరవాత తేరుకుని, పకపక నవ్వసాగింది. ఎంతటి వాళ్ళండి మీ మగవాళ్ళు! నవ్వి నవ్వి కళ్ళ వెంట నీళ్ళు వచ్చేశాయి.

గ్లాసు టేబిల్ మీద పెట్టేసి చేతుల్లో మొహం దాచుకుని వెక్కి వెక్కి ఏడవ సాగింది.

ఏనాడూ కంట తడి పెట్టని సౌజన్యను ఆ స్థితిలో చూసి "సౌజన్యా..." అని కంగారుగా పిలిచాడు.

"నిజమే మీరంటే నాకు ప్రేమ లేదు. ఎంత మాట అన్నారు. ఒక ఆడపిల్ల తనకంటె చదువులో, అందంలో ఎక్కువ అయితే ప్రతి మగవాడు ఇలాగే అంటాడు. నా దోరణి చాలా రోజులుగాగమనిస్తూనే ఉన్నాను. మీరు కాదు ఈ మాట అనేది— మీలోని ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్స్ మీచేత ఈ మాట అనిపిస్తోంది.


ఆడపిల్ల భర్తకోసం ఆదుర్దా పడకపోయినా, ఏడడకపోయినా ఆమెకు భర్తంటే ఇష్టం లేనట్టు, వేరొకరిని ప్రేమించినట్లు అర్థమా? ముభావంగా ఉంటాను అంటారే... అలా ఉండక మీతో ఆర్గ్యూ చేస్తే ఎమ్. ఎ. చదివిందని గర్వమని ఇలా అంటున్న మీరే నన్ను అహంకారిగా జమకట్టేస్తారు అందుకే మీ సంతోషంకోసం మీరేం చెప్పినా, ఎక్కడికి తీసు కెళ్ళినా, ఏం చేసినా అడ్డు చెప్పను. అలా చెప్పకుంటే మీమీద ప్రేమ లేనట్టా?... అందరు భార్యల్లాగా పోట్లాడటం నాకుచేతకాదు. మీకుదెబ్బతగిలినప్పుడు ఆదుర్దా కనబర్చలేదంటున్నారే... మరి నాకు బాగ లేనప్పుడు, జ్వరం వచ్చినప్పుడు మీరెంత మాత్రం ఆదుర్దా కనబర్చారు..." నిలదీసింది.

అప్పుడు గుర్తుకు వచ్చింది అతనికి. సౌజన్యకు క్రిందటిసారి జ్వరం వచ్చినప్పుడు తను డాక్టర్ దగ్గ రకు వెళ్ళమని చెప్పి అర్జెంట్‌గా బిజినెస్ పనిమీద ఊరెళ్ళాడు. తిరిగి వచ్చాక ఆరోగ్యంగా తిరుగుతున్న సౌజన్యను చూసి 'ఎలా ఉందని' అడగడం కూడా మరిచిపోయాడు.

"ఇప్పుడు చెప్పండి! ఆ రోజు నాకు జ్వరం వచ్చినప్పుడు మీ రెంతమాత్రం నా కోసం ఫీలయ్యారు. మీ బిజినెస్ వర్క్‌మీద టూర్ వెళ్ళారు. జ్వరంలో ఒంటరితనంతో నేనెంత బాధపడ్డానో! కానీ మీకునా మీద ప్రేమలేదని అనగలిగానా? లేదే? పరిస్థితిని అర్థం చేసుకున్నాను. ఎంత అర్జెంట్ వర్కో అని ఊరుకున్నాను.

ఇక్కడే మీకూ, మాకూ తేడా? స్త్రీ ప్రేమని అనుభవిస్తుంది. అందుకే ఆమెకు మాటలతో పని లేదు. కానీ మీరలా కాదు. కేవలం మాటలతో వ్యక్త పరుస్తారు.... ఈ నాలుగు రోజులు మీకోసం నేనెంత బాధపడ్డానో మీకెలా తెలుస్తుంది?... అలా తెలపడానికి శోకాలు తీయాలా?... చెప్పండి... నేను మిమ్మల్ని ప్రేమించడంలేదని ఏ ఆధారంతో అన్నారు?" వెక్కుతూనే అడిగింది.

ఆనంద్ బుర్ర గజిబిజిగా తయారయింది. తన అంచనా తారుమారయినట్లుంది. సౌజన్య అడుగుతున్న మాటల్లో ఎంత సత్యముంది. తను ఎంత కుసంస్కారి. ఇలాంటి సౌజన్యకు భర్తగా తను తగుతాడా?...నోరు తెరచి ఏదో చెప్పబోతుండగానే—




"కొందరు ప్రేమని పైకి వ్యక్తపరచగలరు... కొందరు స్వభావ సిద్ధంగా ఎక్కువగా మాట్లాడరు. అంతమాత్రాన వాళ్ళకు ప్రేమ లేదంటారా?... ఏమండీ! మీ అమ్మకు, మీ వదినకు నాకంటె మీమీద ఎక్కువ ప్రేమ ఉండొచ్చు. కాదనను. కానీ... ఎంతయినా భార్యని—నాకూ మీమీద కొంత ప్రేమ ఉంటుందని గ్రహించండి... మీ అమ్మ, వదినలంత గొప్పగా మిమ్మల్ని నేను ప్రేమించలేకపోవచ్చు..." అని కళ్ళనీళ్ళు ఆపుకునేందుకు అక్కడినుండి వెళ్ళిపోయి కిటికీ దగ్గరగా నిలబడింది.

ఆనంద్‌కు తనను చూస్తే తనకే జాలిగా అనిపించింది. 'ఒరేయ్, ఫూల్ నీలోని ఇన్‌పీరియారిటీ కాంప్లెక్స్ సౌజన్యను అలాంటి మాట అనిపించిందిరా!' ఎవరో అతని లోపలినుండి అరుస్తున్నట్టున్నారు.

నెమ్మదిగా ఆమె దగ్గరకు వెళ్ళి భుజంమీద చెయ్యి వేస్తూ "సుజా..." అన్నాడు.

విసురుగా అతని చెయ్యి విదిలించేసింది. సౌజన్యను అంత కోపంగా ఏనాడూ చూడని ఆనంద్‌కు నవ్వు వచ్చినట్లయింది.

"ఇదంతా నామీద కోపమేనా, సుజా.... నీకు కూడా కోపం అంటె తెలుసా?... నా సౌజన్య పేరుకు తగ్గట్లు సౌజన్యమూర్తి..."

"చాలించండి డైలాగులు. ఇకనుండి నా స్వభావానికి విరుద్ధంగా నేనూ మిమ్మల్ని సాధిస్తాను. కోప్పడతాను. అసలైన భార్యలా ప్రవర్తిస్తాను. అప్పటికి మీకు తృప్తిగా ఉంటుంది కదూ..."

"సుజా... సారీ... ఎక్స్‌ట్రీమ్లీ సారీ... చాలా పొరబాటుపడ్డాను. నువ్వు ఎప్పటిలాగా ఉంటేనే బాగుంటుంది. నిజమే! నువ్వూ అందరిలాగ పోట్లాడి సాధించి, విసిగిస్తే నీ విలువ ఏముంటుంది. వద్దు... సుజా... నువ్వు ఎప్పటిలాగే నాకు అనుగుణంగా ఇలాగే ఉండిపో..." సౌజన్య భుజాలు పట్టి దగ్గరకు తీసుకుంటూ అన్నాడు ఆనంద్.

"ఇంకెప్పుడూ ఇలా అనరు కదూ... నా ద్వారా ఏదయినా అసంతృప్తి కలిగితే నాతో చెప్పెయ్యండి. మీలోనే దాచుకుని బాధపడకండి... ఇలా ధైర్యంగా ఒకరి మనసులోనిది ఒకరు చెప్పుకోలేక ఎన్నో కాపురాలు అసంతృప్తితో వేగిపోతూ ఉంటాయి" అంది.

"లేదు, సుజా... ఇంకెప్పుడూ ఇలా అనను...ఈ రోజుతో నాలోని ఈ కాంప్లెక్స్‌ని నీముందే తగుల బెట్టేశాను..." అన్నాడు.

అతడి తలమీద గాయాన్ని ప్రేమగా తడుముతూ "ఈ గాయం నాకు చాలా మేలు చేసింది. ఈ దెబ్బ లేకుంటే మీలో మీరే నా గూర్చి ఏమేమో వూహించుకుని బాధపడేవాళ్ళు. నన్నూ బాధ పెట్టేవాళ్ళు. ఈ ఏక్సిడెంట్‌కి మనం కృతజ్ఞతలు చెప్పుకోవాలి" అంది నవ్వుతూ సౌజన్య. ఇద్దరి పెదవులమీద తేట నవ్వు విరిసింది. ✱